ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 17 ఆగస్టు 2025





గూడెన్‌ఘాట్ వాగును పరిశీలిస్తున్న అధికారులు

నీటి ఉధృతిని పరిశీలించి.. సూచనలు చేసి.

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం కురిసిన భారీ వర్షానికి వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు ఆసిఫాబాద్ మండలం రాజూర గ్రామ సమీపంలోని ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు అటువైపు వెళ్లేందుకు నిరీక్షించాల్సి వచ్చింది. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్, తహసీల్దార్ రియాజ్‌అలీ పరిశీలించి సూచనలు చేశారు. కాగజ్‌నగర్-వాంకిడి మార్గంలో ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ రామానుజం, సిబ్బంది ఉన్నారు.



పెంచికలపేటలో మండలం ఎల్లూరు సమీపంలో వాగు ఉప్పొంగడంతో నిలిచి పోయిన ఆర్టీసీ బస్సు



పెంచికలపేటలో నీట మునిగిన పంటలు



చింతలమానేపల్లి మండలం కర్జెల్లిలో కూలిన ఇల్లు



కాగజ్‌నగర్ కన్యకాపరమేశ్వరీ భవన్ సమీపంలో నిలిచిన వరదనీరు



దహెగాంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు

జోరు వాన

ఉధృతంగా ప్రవహించిన వాగులు, ఒర్రెలు

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- స్తంభించిన జన జీవనం
- చెరువుల్లా మారిన పంట చేలు
- వర్షాలకు తడిసి కూలిన ఇళ్లు
- కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత



కుమరంభీం ప్రాజెక్టు నుంచి కిందికి వస్తున్న నీరు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జోరు వాన కురిసింది. జిల్లాలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం అతలకుతలం అయింది. భారీ వర్షానికి వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా కురిసిన బారీ వర్షానికి తుంపల్లి గ్రామ సమీపంలో గూడెన్‌ఘాట్ వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఆసిఫాబాద్ చిర్రకుంట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజూరా గ్రామ సమీపంలోని ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు అటువైపు వెళ్లెందుకు నిరీక్షించాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, చెక్‌పోస్టు కాలనీలలో వరదనీరు ముంచెత్తింది. వరద ఉధృతికి కంఠకాలనీలోని ఒడ్డెపల్లి ఫంక్షన్‌హల్ ప్రహరీగోడ నేలమట్టమయింది. జూబ్లీమార్కెట్‌లోని మటన్, చికెన్ సెంటర్ల వద్ద వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టులలోకి బారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో కుమరంభీం ప్రాజెక్టులోకి 52,100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా ఆరు గేట్లు పైకి ఎత్తి 52,100 క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 9.600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో నాలుగు గేట్లు పైకి ఎత్తి 10800 క్యూసెక్కుల వరదనీటిని కింది వదులుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటలలో 25.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కౌటాలలో అత్యధికంగా 65.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బెజ్జూరులో 47.2, పెంచికల పేటలో 40.4, ఆసిఫాబాద్, లింగాపూర్ మండలాల్లో 30.8, చింతలమానే˘ఎల్లిలో 29.2, తిర్యాణిలో 27.8, దహెగాంలో 25.2, సిర్పూర్(టి)లో 16.8, జైనూరులో 16.4, కెరమెరిలో 16.2, సిర్పూర్(యూ)లో 15.6, వాంకిడిలో 10.8, రెబ్బెనలో 8.0, కాగజ్‌నగర్‌లో 7.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం 12 గంటల వరకు కురిసింది. వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన మార్కెట్ ఏరియా, కౌసర్ నగర్, ద్వారకనగర్, సంజీవయ్య కాలనీలో వర్షం నీరు వచ్చింది. స్థానిక చాకలి రేవులోకి నీట మునిగింది. కాగజ్‌నగర్ పెద్దవాగులో నీటి ఉధృతి పెరిగింది. పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మండలంలోనిలో లెవల్ వంతెనలు భారీగా ఉప్పొంగడంతో రాక పోకలు స్తంభించాయి. మండలంలోని కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య రెండు లో లెవల్ వంతెనలు ఉప్పొంగడంతో వాగు అవతల ఉన్న ఎనిమిది గ్రామాలకు రాక పోకలు పూర్తిగా స్తంభించాయి. వాగు అవతల ఉన్న సుస్మీర్, సోనిమి, ఇప్పలగూడ, బండలగూడ, పాత సోమిని, గెర్రెగూడ, నాగెపల్లి, చింతలపల్లి తదితర గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోయాయి. హెటిగూడ గ్రామానికి చెందిన పంబాల సన్నాసి ఇల్లు కూలి పోయింది. ఇంట్లో ఉన్న ధాన్యం తడిసి ముద్ద అయింది. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది.

దహెగాం,(ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కురవడంతో ఒర్రెలు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పలు గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. అయినం సమీపంలోని లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు పారడంతో దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లే వాహనాలు గంటల తరబడి నిలిచి పోయాయి. మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు పొంగి ప్రవహించడంతో సుమారు 10 గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి పాక్షికంగా రాక పోకలు స్తంభించాయి. అలాగే సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించడంతో అవతల వైపు ఉన్న మహారాష్ట్రలోని జివితి ప్రాంతానికి రాక పోకలు స్తంభించాయి. మెట్టపిప్పిరి లో లెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిం చింది. నది పరివాహక ప్రాంతాల్లో పత్తిచేలలోకి వరదనీరు చేరింది.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి దిందా గ్రామ ప్రజలకు రాక పోకలు నిలిచి పోగా ప్రపంచానికి దూరంగా ఉన్నారు. గ్రామానికి చెందిన పంగిడి తారక నగ్మాజీ ఇల్లు పూర్తిగా నేలమట్టం అయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేక పోవడంతో ముప్పు తప్పిందని కుటుంబీకులు తెలిపారు. బాలాజీ అనుకోడ గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలి పోయింది. అదే గ్రామానికి చెందిన బాయక్కకు చెందిన ఇల్లు కూలి పోయినట్లు స్థానికులు తెలిపారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెంచికలపేటలో మండలం ఎల్లూరు సమీపంలో వాగు ఉప్పొంగడంతో ఆర్టీసీ బస్సు నిలిచి పోయింది. పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగులతో పాటు ఒర్రెలు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెద్దవాగు వరద ఉధృతితో రహదారులపై నీరు చేరడంతో కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. పెద్దవాగు, ఉచ్చమల్ల వాగు పరివాహక గ్రామాల్లోని పొలాలు, పంట చేనులు నీట మునిగాయి. పులువరి ఇళ్ల ఆవరణలో నీరు చేరింది.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): లేండిగూడ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. నది పరివాహక ప్రాంతాలోని పంటలు భారీ వర్షానికి చేరిన వరదతో నీట మునిగినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాము వాలడ, కోడ్డిగూడ, అలీగూడ, శేట్టిహడ్పూనూర్ వాగులు పొంగి ప్రవహించాయి. వాగులను ఎవరు దాటవద్దని అధికారులు ప్రజలకు హెచరిస్తున్నారు.



ఆసిఫాబాద్ మండలంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న రాజూరా ఒర్రె



కాగజ్‌నగర్‌లో పెద్దవాగులో నీటి ఉధృతి



దహెగాంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు

మొక్కలు నాటి సంరక్షించాలి

రెబ్బెన, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేసే సిబ్బంది, కార్మికులు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు.రెబ్బెన గోలేటిలో సీహెచ్‌పీలో శనివారం మొక్కలను నాటారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడంతో భవిష్యత్తు తరాల వారికి కాలుష్య రహిత సమాజం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం కె.రాజమల్లు, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌హెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీజ్ సంబరాలు



తీజ్ బుట్టలతో వెళ్తున్న చిన్నారులు

జైనూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నందునాయక్‌తండా, కిషన్ నాయక్‌తండా, ఆశపెల్లి, శవనూర్, జంగాం, అంద్‌గూడ, జండాగూడ, తదితర గ్రామాల్లో శనివారం లంబాడా గిరిజనులు తీజ్ సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆడపడచులు భక్తిశ్రద్ధలతో వారు రోజుల క్రితం బుట్టలలో గోధుమ విత్తనాలు చల్లి పూజలు చేశారు. గోధుమ నారు మొలకెత్తడంతో మహిళలు సాంప్రదాయం ప్రకారం ఆటల పాటలతో నృత్యాలు చేస్తు సంబరాలు చేసుకున్నారు ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు రాథోడ్ పవిత రాందాస్, జాదవ్ ధురిబాయి నాయకులు జాదవ్ ధంసింగ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

దహెగాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏడుగురు లబ్ధిదారులకు శనివారం బీజేపీ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దామోదర్, ధనుంజయ్, సురేష్, మల్లేష్, శంకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వారసంతలో పొలాల పండుగ సందడి

సిర్పూర్(టి), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పొలాల పండగ సందర్భంగా శనివారం నిర్వహించిన వార సంతలో సం దడి నెలకొంది. పొలాల పండగ రోజున పశువులను రైతులు అందంగా అలంకరిస్తారు. దీంతో పలు వ్యాపారులు పశువుల అలంకరణ వస్తువులు ఏర్పాటు చేశారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సరస్వతి శిశుమందిర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలువు చోట్ల శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పల్లకి సేవ స్థానిక యాదవ సంఘం నుంచి ప్రారంభమై పట్టణ పలు వీధుల మీదుగా కొనసాగింది. వేడుకలను పురస్కరించుకుని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రవి, సంతోష్, మల్లేష్, శ్రీనివాస్, వెంకటేష్, బీమేష్, బలరాం, మల్లేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. హనుమాన్ ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో యాదవ సంఘం నాయకులు శంకర్, సుచిత్, దీపక్‌ముండే తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆలయలలో ప్రత్యేక పూజలు చేశారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. 24 గంటల పాటు ఎక్కా హం నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని పలు వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. కర్జల్లి ఓంకార ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివకేశవ ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కాహం నిర్వహించారు. అంగడిబజార్ ఏరియాలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడు జట్లు పాల్గొనగా విజేతలకు ఎస్సై విక్రమ్ నగదు పారితోషికం అందజేశారు. క్యాక్రమంలో నిర్వహకులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఎక్కాహం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు వీధుల్లో, ఆలయ ప్రాంగణాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన పోస్టు మెట్రిక్ బాలుర వసతి గృహంలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-15 బాల బాలికల వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18, 19 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్ర మంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ వెంకటేష్, పేట సెక్రటరీ కృష్ణమూర్తి, పీడీ సారంగ పాణి, రాకేష్, పీఈటీ నాగమణి, ఫౌజియా పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా వినోద్

వాంకిడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా కిర్మిల్ల వినోద్‌ను జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియమించారు. ఈ మేరకు వినోద్‌ను శనివారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకుడు తుకారాం తదితరులు సన్మానించారు.

భట్టుపల్లి గ్రామస్థుల నిరసన



ముళ్లకంచ వేసి నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-భట్టుపల్లి ప్రధాన రోడ్డు బురదమయంగా మారిందని, అధికారులు నిర్మాణం చేపట్టాలని శనివారం గ్రామస్థులు భట్టుపల్లిలోని బురదమయంగా ఉన్న రోడ్డుపై ముళ్ల కంపలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళన చేపట్టిన కూడా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఈ ముళ్ల కంపలు తీయమని తెగేసి చెప్పారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకొని ఎంపీడీవో కోట ప్రసాద్ సంఘటన చేసుకొని గ్రామస్థులతో మాట్లాడి పోలీసుకు సమాచారం అందించారు. అనంతరం ఎక్స్‌కవేటర్ సహాయంతో బురదను తొలగించి తాత్కాలికంగా వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఘనపురం శ్రీనివాస్ శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. రెండు పర్యాయాలు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొనసాగిన ఆయన రైతులకు సేవలు అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ఇతర పార్టీల నాయకులు బాధిత కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు శ్రీనివాస్ అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు.

అడవి పంది దాడిలో రైతు మృతి

కన్నెపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో అడవి పంది దాడిలో రైతు మృతిచెందిన అందర్ని కంటతడిపెట్టించింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దాగామ రామయ్య (70) అనే రైతు శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో శనివారం ఉదయం సుర్జాపూర్ గ్రామంలోని పత్తి చేనును చూసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చేను వద్దకు వెళ్లగా అడవి పంది ఒక్కసారిగా రామయ్యపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ భాస్కర్‌రావు పరిశీలించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా అంతకుముందే అడవి పంది గుండ్ల చిరంజీవి, మేకల బాపు అనే వ్యక్తులపై దాడి చేయగా వారు కూడా గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స కోసం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కూలిన మాజీ ఎమ్మెల్యే ఇంటి పైకప్పు

తప్పిన ప్రమాదం



కూలిన మాజీ ఎమ్మెల్యే ఇంటి పైకప్పు

బెల్లంపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా భారీవర్షంతో మాజీ ఎమ్మె ల్యే దుర్గం చిన్నయ్య సింగరేణి క్వార్టర్ ఇంటిపైకప్పు శనివారం కూలింది. పై కప్పు కూలిన సమయంలో దుర్గం చిన్న య్య ఇంటిలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే నివాసం ఉంటున్న ఏ3 సింగ రేణి క్వార్టర్‌లో పలు గదుల్లో పై కప్పు పెచ్చుపెచ్చులుగా కూలి ఇనుప రాడ్లు దర్శనమిచ్చాయి. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే సోషల్ మీడి యాలో ఒక వీడియో పోస్టు చేసి మాట్లాడారు. కొన్ని నెలలుగా క్వార్టర్ల విషయపై సింగరేణి అధికారులు పలుజాగ్రత్తలు తీసుకోవాలని పలుమార్లు విన్నవిం చుకుంటున్నా పట్టించుకోకపోవడంతో వర్షాలకు ఇంటి పై కప్పు కూలిందని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు పురాతనసిం గరేణి విషయంపై తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

వరదనీటిలో చిక్కుకున్న యువకులు

ఐదుగురిని తాళ్లసాయంతో కాపాడిన స్థానికులు

కాసిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం చేపల వేటకు వెళ్లిన ఐదుగురు యువకులు వరదనీటిలో చిక్కుకపోయి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. సమయానికి స్థానికులు సకాలంలో స్పందించడంతో ప్రాణాలతో బయటపడిన ఘటన శనివారం బుగ్గగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం బుగ్గగూడెంకు చెందిన మారినేని సంతోష్, మారినేని సంజీవ్, మారినేని సాగర్ వీరు ముగ్గురు స్వయాన అన్నదమ్ములు. వీరితో పాటు బద్ది అరుణ్, ఏదుల శశికుమార్ చేపలు పట్టేందుకు బుగ్గచెరువు మత్తడి కిందకు వెళ్లారు. శనివారం ఉదయం ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది దీంతో మత్తడి పొంగిపొర్లడంతో ఐదుగురు యువకులు వరదనీటిలో చిక్కిపోయారు. వరద ఉధృతి పెరగిపోవడంతో యువకులు కేకలు వేశారు. అదగమనించిన స్థానికులు తాళ్ల సాయంతో వారిని బయటకు లాగి ప్రాణాలు కాపాడారు. యువ కులను కాపాడిన జంజిరాల విష్ణుమూర్తి, కడారి రాజు, మాలోత్ తిరుపతి, మను బోతుల ఎల్లయ్య, మారినేని దివాకర్, బద్ది పెద్దులు, బద్ది బీమలింగులను స్థానికులు అభినందించారు.

చెలరేగిన మంటలు

జన్నారం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సతీష్‌గౌడ్ ఇంటి సమీపంలో శనివారం కురిసిన బారీ వర్షానికి ఒక్కసారిగా సమీపంలో పిడుగు పడింది. దీంతో ఇంటిలో ఉన్న విద్యుత్ పరికరాలకు హైపవర్ రావడంతో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న ఫైర్ అధికారులు శ్రీనివాస్ సంఘటన స్తలానికి చేరుకొని మంటలార్పారు. సంఘన స్థలాన్ని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి సందరిశ్రంచారు. మూడు లక్షల రూపాయల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రణాళిక సిద్ధం



- కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాకు 3,598 యూనిట్లు

వాంకిడి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో గతంలో ఉన్న మార్గదర్శకాలను ప్రభుత్వం తొలగించింది. దీంతో వ్యవసాయ అధికారులు నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణకు సన్నాహాలు ప్రారంభించారు. గతంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకాన్ని కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం అమలు కోసం కుమరంభీం జిల్లాకు రూ. 2.51 కోట్లు నిధులతో 3,598 యూనిట్లు అందించనున్నారు.

కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఈ పథకానికి కేటాయిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం సబ్సిడీ వర్తించనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పథకం అమలు ఆలస్యం కావడం తో బడ్జెట్ కేటాయించలేదు. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని వానాకాలం నుంచి యాసంగి వరకు పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు.

ఎనిమిది రకాల పరికరాలు..

జిల్లాలో ఎనిమిది రకాల పరికరాలను అందిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం గత ఆరేళ్లగా నిలిచింది. దీంతో రైతు లు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించే అవకాశం లేకుండాపోయింది. ఈ పథకాన్ని అమలు చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేసిన గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ యాంత్రీకరణ ఊసు లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది యాసంగి నుంచే రైతులకు రాయి తీపై వ్యవసాయ పరికరాలను అందచేయాలని నిర్ణయించింది.

జిల్లాల వారీగా రైతుల నుంచి ఉన్న డిమాండ్‌ను పరి గణలోకి తీసుకునేందుకు ఉమ్మడి జాల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు తీసుకుంది. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను రూపొందించారు. కుమరం భీం జిల్లాలో ఎనిమిది రకాల పరికరాలను అందిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో రోటవేటర్, కల్టివేటర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ వీడర్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, బండ్ ఫార్మర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్లు, బ్యాటరి స్ప్రేయర్లు అందిం చనున్నారు. ఆసక్తి ఉన్న అర్హులైన రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్, బ్యాంకు ఖాతాలతో సంబంధిత ఏఈవోలకు దరఖాస్తు చేయాలి.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి వ్యవసాయ అధికారులు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. వ్యవసాయ అధికారులు అన్ని దరఖాస్తులను జిల్లా కలెక్టరుకు అందజేస్తారు. జిల్లా కమిటీ ఆమోదం తరువాత యూనిట్లను మండలాల వారీగా కేటాయిస్తారు. ఎంపికైన రైతులు సబ్సిడీ పోను పెట్టుబడి వాటాను డీడీల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వ మార్గదర్శ కాలను అనుగుణంగా సెప్టెంబరు నుంచి పరికరాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. కాగా ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అట కెక్కింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు నచ్చిన కంపెనీకి చెందిన వ్యవసాయ పరికరాలను అందించనున్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..

మిలింద్‌కుమార్, ఆసిఫాబాద్ ఏడీఏ



వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులను నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. అర్హులైన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు ఖాతాలతో సంబంధిత ఏఈవోల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల స్వీకరణ తరువాత జిల్లా, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన రైతులను గుర్తించి పరికరాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తాం. రైతులు పథకాన్ని సద్వి ని యోగం చేసుకోవాలి.

చిరుతపులి దాడిలో లేగదూడ మృతి

కాసిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మరావుపేట అటవీసె క్షన్ పరిధిలోని తిరుమలపూర్ బీట్ 329 కంపార్ట్‌మెంట్‌లో ఆవుల మందపై చిరుత పులి దాడి చేసి లేగదూడను చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. నాలుగు రోజుల క్రితం ఆవుల మందపై చిరుత పులి దాడి చేయడంతో పశువుల కాపరులు భయాందోళనకు గురయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పశువుల కాపరులు అటవీశాఖ అధికారులు అడవిలోకి వెళ్లలేకపోయారు. శనివారం ధర్మరావుపేట సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎఫ్‌డీవో యుగేందర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. లేగదూడ మృతి చెంది మూడు నాలుగు రోజులు కావడంతో కళేబరం మొత్తం కుళ్లిపోయింది. లేగదూడ ధర్మరావుపేట రైతుదిగా గుర్తించారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అలాగే పెండింగ్ సమస్యలపై డీఎస్పీ రామానుజం, సీఐ ప్రేంకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు.మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అసాంఘిక కార్యకలపాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విరబూసిన బ్రహ్మకమలం

బ్రహ్మకమలం ఇది ఒక అరుదైన పుష్పం. రాత్రి పూట వికసించి ఉదయాన్నే వాడిపోవడం దీని ప్రత్యేకత. అరుదైన ఈ పుష్పం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చౌదరి సుజాత, శ్రీనివాస్ ఇంట్లో శుక్రవారం రాత్రి వికసించింది. హిమాలయ పర్వతాల్లో కనిపించే ఈ అరుదైన మొక్కను మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో కొనుగోలు చేసి ఇంటి ఆవరణలో నాటారు. ఇప్పుడు ఈ పుష్పం వికసించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన పుష్పంగా పురుణాల్లో ఉందని, ఏడాదిలో ఒక సారి మాత్రమే అది రాత్రివేళల్లో పూస్తుందని చెబుతున్నారు. రాత్రివేళల్లో శ్వేత వర్ణంలో పెద్దగా వికసించే ఈ పూలు ఉదయానికి మొగ్గలా ముడుచుకుంటాయి.

\- పెంచికలపేట



క్రీడాకారులకు అభినందన

రెబ్బెన, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు పోటు శ్రీధర్ రెడ్డి, మారం శ్రీనివాస్, దుర్గం రవీందర్ అభినందించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల బాల్ బాడ్మింటన్ పురుషులు, మహిళలు పోటీలు గోలేటిలోని సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఎ్ తిరుపతి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా బాల్ బాడ్మింటన్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, భాస్కర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. కాగా పురుషుల జట్టుకు కె.సిద్దార్థ్ రాజ్, తిరుపతి, పి.పవన్ కుమార్, తరుణ్, గోపాల్, పి.శ్రీకాంత్, సాయి చరణ్, దిలీప్‌కుమార్, దేవరాజ్, సూర్యకుమార్, ప్రేంకుమార్, గోపాలకృష్ణ, వరుణ్ ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఎస్వప్న, కె.అంజలి, డి.శ్రావణి, జి.అనుష, స్ఫూర్తి, కారుణ్య, ప్రజ్వల, శ్రావ్య, సహస్ర, సాయి, వర్షిణి, సుజాత, సాయిదీక్ష, సంజన, అర్చన వైష్ణవి, హారిక ఎంపికయ్యారు.

21న మందకృష్ణ మాదిగ రాక

కౌటాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ పెంచాలని కోరుతూ ఈ నెల 21న కౌటాల మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నారని సంఘం నాయకులు తెలిపారు. స్థానికంగా శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు థామస్, సత్యనారాయణ, శ్రీశైలం, విఠల్, రాజేష్, ఇరామన్, శంకర్, తిరుపతి, బాలరాజు, సురేష్, జనార్ధన్, రాజన్న, గుణాజీ, సంతోష్, బాలయ్య, విష్ణు, శ్రీహరి, విఠల్, ప్రకాష్, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు కురుస్తున్నందున పెసరికుంట గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. మండలంలోని పెసరికుంట, బీబ్రా, అయినం, దహెగాం గ్రామాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలో కురిసి వర్షాలకు కుమరం భీం ప్రాజెక్టు ఆరు గేట్లు ఎత్తి వేసి నీటినిని కిందికి వదులుతున్నందున పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పెద్దవాగు సమీపంలోని ఐదు కుటుంబాలను పెసరికుంట గ్రామంలోని సీఎస్ఐ చర్చికి తరలించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో రాజేందర్, ఎంఆర్ఐ నాగభూషణం, కార్యదర్శులు రాజేష్, ప్రణీత్‌బాబు, తదితరులు ఉన్నారు.



పెసరికుంట పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రెబ్బెన, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆస్తులున్న ప్రదేశంలో అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులకు సంబంధించిన మూడు వాహనాలను బెల్లంపల్లి ఏరియా ఎస్ అండ్ పీసీ అధికారులు శనివారం పట్టుకున్నారు. గోలేటి1ఎ ఇంక్లయిన్‌లో ముగ్గురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించినట్టు తాము వివరాలు వాకాబు చేసే లోపు అంతా పారిపోయినట్టు వివరించారు. ఈ మేరకు ఈ మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ అండ్ పీసీ ఇన్‌చార్జి డి శ్రీధర్ తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

వాంకిడి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు పోలీసులు శనివారం అప్పగించారు. వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి చెందిన భీంరావు, మధుకు చెందిన మొబైల్ ఫోన్లు పోవడంతో వాంకిడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు శనివారం అందించినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మొబైల్ ఫోన్‌లు గుర్తించడంలో ప్రతిభ చాటిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు.

పోస్టర్ల విడుదల

దహెగాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 18న తలపెట్టిన చలో ఢిల్లీ కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో తెలంగాణ మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా నుంచి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సుధాకర్, నాగరాజు, నరేష్, సాయికుమార్, రాకేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు పనులు సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీలలో శనివారం నిర్వహించిన మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి పనిని సమర్థవంతంగా చేసినప్పుడే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. తద్వారా ఉద్యోగులు అధిక ప్రయోజనం పొందుతారన్నారు. శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ముందంజలో ఉందని తెలిపారు. ఉపరితల గనిలో పరిస్థితులను అంచనా వేస్తూ పనులు చేపట్టాలని జీఎం సూచించారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, టీం-2 కన్వీనర్ ఏవీ రెడ్డి, ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, సభ్యులతో పాటు ఓసీపీ మేనేజర్ శ్రీనివాస్, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, రక్షణాధికారి శ్రీధర్, సంక్షేమా ధికారి బాబు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విధానంలో మార్పు అవసరం



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగ రేణి సంస్థలో మెడికల్ విధానంలో మార్పు అవసరమని, నెలకు రెండు సార్లు మెడిక్ బోర్డు నిర్వహించాలని, 90 శాతం ఉద్యోగుకు అనుకూల ఫలితాలు ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి, శ్రీనివాస్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో రెండు సంవత్సరాల క్రితం ఉద్యోగి దిగిపోయి కొడుక్కు లేదా అల్లునికి ఉద్యోగం ఇచ్చే వెసలుబాటు ఉండేదన్నారు. సింగరేణిలో ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మాట్లాడే అవకాశాన్ని తొలగించారని చెప్పారు. ఇది సరైంది కాదన్నారు. ఇటీవల మెడికల్ ఇన్వాడిలేషన్ ప్రవేశపెట్టి మెడిక్ అన్‌ఫిట్ అయిన వారికే ఉద్యోగాలు ఇస్తున్నారని తెలిపారు. ఇందులో కూడా ఏదో సాకుతో విజిలెన్స్ పేరుతో విచారణ జరుగుతుం దని తెలిపారు. ఇప్పటికే 3,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటికి ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియడం లేదన్నారు. 90 శాతం మందిని మెడికల్ ఇన్వాలిడేషన్ చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కు సాధన కోసం హెచ్‌ఎంఎస్ యూనియన్ ఎల్లవేళలా పోరాటాలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, శ్రీనివాస్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పోరాటానికి మద్దతు

శ్రీరాంపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌పీ సాధనలో భాగంగా అధికారులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు ఉత్పత్తి సాధనలో అధికారుల పాత్ర కూడా కీలకమన్నారు. అటువంటి వారికి ఫెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్(పీఆర్‌పీ) ఏళ్లుగా చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారులు వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, ఆర్థికంగా ఆనందంగా ఉంటేనే ఉత్పత్తి సాధనలో మనస్ఫూర్తిగా పాలుపంచుకునే అవకాశం ఉంటుందన్నారు. వారికి పీఆర్‌పీ ఇవ్వడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం వల్ల వారు పోరుబాట పట్టారని అన్నారు. అధికారులకు రావాల్సిన పీఆర్‌పీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని సంఘాలను కలుపుకొని సింగరేణిలో భారీ ఉద్యమానికి తెరతీస్తామని వారు తెలిపారు.



వర్షంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



వర్షానికి బురదమయంగా మారిన కేకే ఓసీపీ

మందమర్రిటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మందర్రిలో శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. స్థానిక కేకే ఓసీపీలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో కొంత ఉత్పత్తికి ఆటంకం కలిగింది.వర్షం నీరు తొలగించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. వర్షం కారణంగా కార్మికుల హాజరు శాతం తగ్గింది. ఉదయం షిఫ్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా యాజమాన్యం చర్యలు చేపట్టింది. రోజువారి ఉత్పత్తికి నష్టం వాటిల్లితే లక్ష్యం చేరుకోవడం కష్టమని భావిస్తున్నారు. దీని కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఓసీపీతో పొలాల్లోకి చేరుతున్న నీరు

జైపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఓపెన్‌కాస్టు మట్టిని రామారావుపేట శివారులో గుట్టలుగా పోయడంతో వర్షాకాలంలో వర్షం నీరు మట్టితో పాటు పొలాల్లోకి చేరడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఎన్నిసార్లు సింగరేణి యాజమాన్యానికి విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి జోక్యం చేసుకుని సింగరేణి అధికారులతో మాట్లాడాలని చెప్పారు. వర్షం ద్వారా జారే మట్టి కుప్పలు పొలాల్లోకి రాకుండా చూడాలని చెప్పారు. రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


కన్నెపల్లి మండలంలో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్


బెల్లంపల్లి రాంనగర్ బ్రిడ్జిపై వరద నీరు..


మందమర్రిలో వరద నీటితో చిక్కుకున్న పశువులను కాపాడుతున్న దృశ్యం


తాండూర్ మండలం కాసిపేటలో ఇళ్లలోకి చేరిన నీరు


భీమారం మండల కేంద్రంలోని నిండుకుండలా ఉన్న చెరువు

దంచికొట్టిన వాన..

బెల్లంపల్లి, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్ల పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి రహదారులు నీట మునిగి రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. పట్టణంలోని పలు వార్డులో వరదనీటితో పలు ఇళ్లల్లోకి నీరు చేరింది. అలాగే పట్టణంలోని రాంనగర్ బ్రిడ్జిపై నుంచి వరనీరు ఉధృతంగా ప్రవహించడంతో వార్డు ప్రజలకు రాక పోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. స్టేషన్ ఏరియాలోని పలు రైల్వే క్వార్టర్లలోని ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తాండూర్ : మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. తాండూర్‌లోని శివాజీనగర్‌లోని బెస్తవాడలో పిడుగు పడడంతో హైమాస్ట్‌లైట్లు ధ్వంసమయ్యాయి. వర్షాలకు అచ్చలాపూర్‌లోని పెద్దచెరువులు, కొమ్ముగూడెంలోని చెరువులు నిండుకుండలా మారాయి. చెరువులను ఎస్ ఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. భారీ వర్షానికి అలాగే కాసిపేట గ్రామంలోని 5వ వార్డులోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. గోపాల్‌నగర్‌లోని పత్తి చేన్లలోకి నీరు చేరడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అచ్చలాపూర్‌లోని బీసీవాడలోని ఇళ్లలోకి నీరు చేరింది.

●భారీ వర్షాలకు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని తాండూర్ సీఐ దేవయ్య సూచించారు.

మందమర్రిలో నీటమునిగిన పంట పొలాలు

మందమర్రిటౌన్ : మందమర్రిలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. శనివారం కూడ ఉదయం నుంచి కుండపోత వర్షం పడింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. 17 వవార్డు భాగ్యనగర్ కాలనీలో నీరు నిలిచిపోవడంతో మున్సిపల్ కమిషనర్ స్పందించి నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పాల చెట్టు ఏరియాలోని కోల్‌బెల్ట్ రోడ్డుకు రెండు వైపుల నీరు నిలిచిపోవడంతో జేసీబీ ద్వారా డ్రైనేజీ పనులు చేపట్టారు. పలు కాలనీల్లో వరద నీరులో కాలినడకన తిరుగుత వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పట్టణంలోని 2వ జోన్ జిల్లా పరిషత్ పాఠశాలలో వరద నీరు చేరుకుంది. అంతేగాకుండా స్టేషన్ సమీపంలోని ఊరు రామకృష్ణాపూర్ నిండుకుండలా తయారైంది. సమీపంలోని పంట పొలాలకు నీరు చేరింది. పట్టణంలోని పాకిస్తాన్ క్యాంప్ సమీపంలోని పాలవాగు పొంగిపొర్లడంతో పక్కనే ఉన్న పంట పొలాలు నీటమునిగిపోయాయి. సీఈఆర్ క్లబ్ సమీపంలోని వాగు వరద ఉధృతికి ఒర్రె గడ్డజిల్లా పరిషత్ పాఠశాలలో కూడ నీరు చేరుకుంది. పాలచెట్టు సమీపంలో కూరగాయల మార్కెట్ బురద మయంగా మారింది. స్థానిక శాంతినగర్, విద్యానగర్, సీఎపీలో ప్రహారి గోడలు కూలిపోయాయి. ఆ ప్రాంతంలో డ్రైనేజీల పూడికతీత పనులు చేపట్టారు. కమిషనర్‌తో పాటు సహాయ చర్యల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులను కాపాడిన మున్సిపల్, పోలీసులు

మండలంలో కురిసిన భారీ వర్షానికి ఓ రైతు పొలంలో సమీపంలో ఏర్పాటు చేసుకున్న పశువుల పాక, వరదనీటికి కొట్టుకుపోయింది. అందులో కట్టేసిన ఆవులు, మేకలు కొట్టుకపోయాయి. వెంటనే మున్సిపల్ కమిషనర్ రాజలింగు, రామకృష్ణాపూర్ ఎస్ఐ పోలీసు సిబ్బంది కలిసి పశువులను రక్షరించారు.

మామడ వెళ్లే రోడ్డు మూసివేత

వేమనపల్లి : మండలంలోని నీల్వాయి పంచాయతీ పరిధిలోని మామడకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న వాగు వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఈ రోడ్డు ను శనివారం రెవెన్యూ అధికారులు, పోలీసులు ఎడ్ల బండ్లను అడ్డంగా పెట్టి మూసివేశారు. వర్షాలు అధి కంగా కురుస్తున్నందున మామడ గ్రామస్తులు వాగు దాటే ప్రయత్నం చేయవద్దని ఎంపీడీవో కుమారస్వామి హెచ్చరించారు.

-ప్రాణహిత నదిని పరిశీలించిన అధికారులు

భారీ వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న వేమనపల్లి సరిహద్దున ఉన్న ప్రాణహిత నది ప్రవాహాన్ని శనివారం ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో కుమారస్వామి, తహసీల్దార్ సంధ్యారాణి పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ అబ్దుల్ కాలిక్, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు ఉన్నారు. ప్రాణహిత నది వరద ప్రవాహానికి కల్లెంపల్లి, సుంపుటం, జాజులపేట, వేమనపల్లి, ముల్కలపేట, రాచర్ల , కేతనపల్లి గ్రామాల శివారులోని పత్తి పంటలు నీట మునిగాయి.

లక్ష్మీనగర్‌లో ఇండ్లలోకి చేరిన వరద నీరు

మంచిర్యాలక్రైం: జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల క్వారీ గుట్టల నుంచి వచ్చిన వరద నీరు పాత మంచిర్యాల సాయిబాబా టెంపుల్ సమీపంలోని లక్ష్మీన గర్ ఇండ్లలోకి నీరు చేరింది. దీంతో ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వరద రావడంతో నాళాలు మూసుకపోయి ఇండ్లలోకి వరదనీరు చేరింది. మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, మున్సిపాలిటి సిబ్బందితో నాలాపూడిక తీసి చర్యలు చేపట్టారు.

వరి, పత్తి పంటలకు నష్టం

నెన్నెల : మండలంలో శనివారం ఉదయం భారి వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. కుండపోతగా మూడు గంటల పాటు వర్షం కురియడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోనంపేట పాటివాడ చెరువుకు గండి పడింది. నెన్నెల కుమ్మరివాగు ప్రాజెక్టు కుడి కాలువ తెగడంతో ఆయకట్టు పొలాలన్ని జలమయ్యాయి. ఇటీవ లనే నాట్లు పూర్తి చేసుకున్న పొలాల్లో నారంతా కొట్టుకుపోయింది. ఎర్ర వాగు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాత్కాలిక వంతెన కొట్టుక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జోగాపూర్ వద్ద మత్తడివాగు బ్రిడ్జిపై నుంచి పారుతోంది. ఎస్సై ప్రసాద్ అక్కడికి చేరుకొని రాకపోకలను నిలిపివేశారు. నెన్నెల, ఆవడంలో ఇళ్లు నేలకూలాయి.

●మండలంలో శనివారం బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనో జ్ దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. ఎర్రవాగు కుడి కాలువకు గండి పడిన ప్రాంతాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని సుంకరివాడలో వరద నీరు ఇళ్లల్లో చేరిన బాధితులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.


గూడెం గోదావరి నదిలో నీట మునిగిన పుష్కరఘాట్

చెన్నూరు : పట్టణంలో, మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి వాగులు ఉప్పొంగాయి. పట్టణంలోని పలు రోడ్లపై నీరు నిలిచింది. రాంపల్లి, కత్తెరసాల, సంకరాం, బుద్దారం, సుద్దాల గ్రామాల సమీపాల్లోని వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. అక్కెపల్లి గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై ఎన్న కాజ్‌వే శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు కాజ్‌వేపై నుంచి వాగు నీరు ప్రవహించడంతో ప్రజలు వాగు దాటలేక ఇబ్బందులు పడ్డారు. ఆస్నాద గ్రామంలో వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది.

భీమారం : మండలంలోని బూరుగు పల్లి -నర్సింగాపూర్ మధ్యగల మత్తడి వాగు ఉప్పొంగడంతో బూరుగుపల్లి మీదుగా నర్సింగాపూర్ కాజీపల్లితో పాటు నెన్నెల మండలం ఆవడం, చిత్తాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా నీరు చేరడంతో రాక పో కలకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానిక ఎస్ఐ శ్వేత, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వేణుచందర్‌లు చేరుకుని వరద ప్రవాహాన్ని పరిశీలించారు. వాగు వరద ఉధృతి తగ్గేంత వరకు ఎవరు రోడ్డును దాటవద్దని సూచించా రు.

●వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువులు నిండి నీరు మత్తడి దూకుతుంది. గొల్లవాగు ప్రాజెక్టులోకి ఇప్పటి వరకు మూడు మీటర్ల నీరు వచ్చిందని, ఇంకా భారీగా నీరు చేరితే ప్రాజెక్టుపై ఆధారపడే రైతులు పంటలు వేసుకోవచ్చని ఆనందం వ్యక్తం చేశారు.

హాజీపూర్: హాజీపూర్ మండలంలో శనివారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటపొలాలు నీటి ప్రవాహంలో మునిగి పో యి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గుడిపేట, నంనూర్, ఆర్అండ్ఆర్ కాలనీల్లో వరదనీరు రోడ్లపైకి వచ్చింది. రాపెల్లి, నర్సిం గాపూర్ శివారుల్లో పంట పొలా ల్లోకి వరదనీరు చేరింది. తహసీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

కన్నెపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పర్యటించారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, ప్రాజెక్టులు, వరదలు ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తమ పత్తి, వరి పంటలు వర్షానికి నీటిలో మునిగాయని తమను ఆదుకోవాలని సబ్ కలెక్టర్‌కు రైతులు, బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు మహేష్‌గౌడ్ విన్నవించారు. కాగా మండలంలోని జజ్జరవెల్లిలో ఉన్న వాగు వర్షాలకు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జన్నారం: మండలంలో ఉదయం 6గంటల నుంచి ఏకదాటిగా సుమారు 5గంటలపాటు కురవడంతో నాళాలు, కాల్వలు ఉప్పొంగి ప్రవహించాయి. భారీవర్షాలు ఉన్నయన్న హెచ్చరికలతో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ బుడగ జంగాల కాలనీవాసులను అప్రమత్తం చేసి స్థానిక ఆశ్రమ పాఠశాలతో పాటు వీఆర్‌టీ భవన్‌లోని నిర్వాసితులను ఉంచారు. రోటిగూడవాగు ఉప్పొంగి ప్రవహించడంతో తహీల్దార్, ఎం ఎడీవోలు వాహనదారలు వెళ్ల కుండా అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. శ్రీలంక కాలనీలో నాళాలు ప్రవహించాయి. కడెం ప్రాజెక్టు 15గేట్లు ఎత్తడంతో గో దావరి నది ఉప్పొంగి ప్రవహించింది.

దండేపల్లి: ఎగువ ప్రాంతంలో ఎడ తెరిపు లేకుండా కురుస్తున్న వర్షలకు కడెం ప్రాజెక్టు 15 గేటు ఎత్తి ఈ వరద నీటిని గోదావరికి వదిలారు. దీంతో వరద తకాడి పెరిగింది. దీంతో గూడెం పాత లోలెవల్ వంతెన నీటి మునగడంతోపాటు నది వద్ద ఉన్న గోదావరి నది వద్ద పుష్కర్ ఘాట్ నీట మునిగింది.

●గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారులు తమ సిబ్బందితో వరదల ప్రభావంపై ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేశారు. నర్సాపూర్‌లో శాత రాజు సతీష్ ఇంటి గోడ కూలింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

కాసిపేట: రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు రేగులగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలోకి భారీ వరద నీరు వచ్చి చేరింది. ఆశ్రమ పాఠశాల ఆవరణతో పాటు తరగతి గదిలోకి వచ్చి వరద నీరు వచ్చి చేరడంతో పిల్లలు పై అంతస్తులోకి పరుగులు తీశారు. రెండు రోజులుగా బడికి సెలవులు రావడంతో హాస్టల్లో 60 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. విద్యార్థులను సురక్షిత ప్రాంతాల్లోకి తరలించి తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మందమర్రిరూరల్ : మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. సారంగపల్లి మెయిన్ రోడ్డు నుంచి మహిపాల్ రెడ్డి ఇంటి వరకు వరద నీరు చేరడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. చిర్రకుంటలో ఇండ్ల లోకి నీరు చేరింది. తుర్కపల్లి వద్ద రోడ్ డ్యాంపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. శంకర్‌పల్లిలో నీరు ఇళ్లలోకి చేరింది. కేకే 5 గని వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.వరద నీటిని ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం పరిశీలించారు. వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,


కత్తెరసాల సమీపంలో ప్రవహిస్తున్న వాగు


మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో నీట మునిగిన పొలాలు


గుడిపేట ఆర్అండ్ఆర్ కాలనీలో వరద ప్రవాహం


లక్షెట్టిపేట లో కొమ్ముగూడెం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్


జన్నారం మండలం శ్రీలంక కాలనీలో ఏరులై పారుతున్న నీరు

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

నెన్నెల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) :తమ పదేళ్ల కష్టాన్ని దూరం చేస్తూ కరెంటు, తాగునీటి సౌకర్యం కల్పించినందుకు గాను కృతజ్ఞతగా శనివారం ఘన్‌పూర్ గొల్లవాడ ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రూ. 4 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో వాడకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. కొత్తగా రెండు బోర్లు వేసి కరెంటు మోటర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ చొరవతో ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు కంపెల రాజశేఖర్, నాయకులు గుర్నాధం మల్లాగౌడ్, గన్న సతీష్, మెండె నర్సయ్య, పుర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించాలి

హాజీపూర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అత్యవసర సమయంలో సహాయం కోసం పోలీసులను సంప్రదించాలని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ అన్నారు. శనివారం కురిసిన భారీ వర్షాలకు ముల్కల్ల శివారులో జాతీయ రహదారి 63పై భారీ వృక్షం పడిపోడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ ఆకుల అశోక్ కుమార్, ఎస్ఐ స్వరూప్ రాజ్, నిమిషాల వ్యవధిలో జేసీబీ సాయంతో వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డీపీఆర్‌వో కృష్ణమూర్తికి అభినందన

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న డీపీఆర్‌వో కృష్ణమూర్తికి సోమవారం సంస్కృతిక సమాఖ్య సారధి కళాకారులు శుభాకాంక్షలు తెలిపారు. కళాకారులు మాట్లాడుతూ వృత్తిపట్ల నిబద్ధత, క్రమ శిక్షణతో ఆయన విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఆయనకు అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. కళాకారులు కొప్పర్తి రవీందర్,లచ్చన్న, వెల్తూరి పోశం, సురేందర్, రమేష్, వెంకటకృష్ణ, గొడిసెల కృష్ణ, కృష్ణ, శ్రీని వాస్, నాగలక్ష్మీ, సంధ్యనిరోషా, శ్రావణ్, శిరీష, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉప్పొంగిన టేకుమట్ల వాగు

జైపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి టేకుమట్ల గ్రామంలోని టేకుమట్ల వాగు ఉప్పొంగింది. దీంతో శివ్వారం, వేలాల, శెట్‌పల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాగు వద్దకు ఎవరు వెళ్లకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేశారు.

ఇళ్లలోకి చేరిన నీరు

కోటపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరింది. మండల కేంద్రంలోని సమ్మక్క అనే మహిళకు చెందిన ఇంట్లోకి నీరు ప్రవేశించింది. బాధితురాలు ఇంటి సమీపంలోని ఒర్రె ఉధృతంగా ప్రవహిం చింది. ఓ వైపు ఎత్తు ప్రాంతంలో రోడ్లు వేయడం, మరో వైపు లోతట్టు ప్రాంతంలో బాధితురాలు ఇల్లు ఉండడంతో ఇంట్లోకి నీరు ప్రవేశించగా తెల్లారే వరకు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసింది. ఈ ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్ఐ రాజేందర్ ఆమెను సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించారు.

హక్కులను కాపాడే నాయకుడినే గెలిపించుకోవాలి

కాసిపేట, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికుల హక్కులను కాపాడే నాయకున్నే గెలిపించుకోవాలని తెలంగాణ కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం దేవాపూర్ కంపెనీ ఆవరణలో ఓరి యంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ నిర్వహించి గేటు మీటింగ్‌కు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కన్నేళ్లుగా కార్మికులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. వారి హక్కుల పరిరక్షణ కోసం కొక్కిరాల సత్య పాల్‌రావును గెలిపించు కోవాలని సూచించారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సీఎస్ఆర్ నిధులను ఓరియంట్ ప్రభావిత గ్రామాల్లోనే అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఓరియంట్ కార్మికులకు గ్రూపు గ్రాట్యువిటి ఇప్పించే విధంగా యాజమాన్యంతో పోరాడి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఓరియంట్‌సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్‌రావు మాట్లా డుతూ యూనియన్ అధికారంలోకి వస్తే కార్మికుల కోసం 24గంటల వైద్యసదుపాయం కల్పిం చడంతో పాటు 5లక్షల మెడిక్లైమ్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, రాపర్తి శ్రీనివాస్, గిరిజన సంఘాల నాయకులు సిడాం అచ్యుత్ రావు, రాందాస్, కుమురం జనార్ధన్, సతీష్ రెడ్డి, శంకర్, సతీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


దేవాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

జైపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో విద్యుత్ తీ గలు ప్రమాద కరంగా మారాయి. తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇటీవల నిర్మించిన భవనంపై గల విద్యుత్ తీగల కారణంగా ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు ఆరోపి స్తున్నారు. కార్యాలయం పక్కనే ఉన్న విద్యుత్ స్తం భాన్ని వేరే చోటకు మా ర్చాలని విద్యుత్ అధికా రులను కోరినా స్పందించడం లేదన్నారు. విద్యుత్ స్తంభం మారిస్తే ఇ బ్బందులు ఉండేవి కావ ని ప్రజలు పేర్కొంటు న్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పైకప్పు పై గల ఇనుప రేకు లకు విద్యుత్ తీగలకు తగలడంతో రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా అయ్యిందని స్థానికులు పేర్కొ న్నారు. అదృష్టవశాత్తూ ఆ ప్రదేశంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఎవరైనా ఆసమయంలో గోడను తాకి ఉంటే ప్రాణాలు పోయేవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పట్టిచుకుని నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని కోరుతున్నారు.


ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు

మంచిర్యాలలో విద్యుత్ అంతరాయం

మంచిర్యాలక్రైం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్ ఒక ప్రకటలో తెలిపారు. రాంనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, కాలేజీ రోడ్డు, పాత మంచిర్యాల మార్కెట్ ఏరి యాలో విద్యుత్ అంతరాయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందని అలాగే ఏసీసీ సబ్ స్టేషన్ పరిధిలో అండాలమ్మ కాలనీ, జాఫర్‌నగర్ డీసీపీ కార్యాలయంలో హైటెక్ సిటీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

శ్రీరాంపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమంగా తర లిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బెల్లంపలి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. బెల్లంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మహారాష్ట్రకు తరలించేందుకు రైల్వే స్టేషన్‌లో ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ప్యాసింజర్ రైలులో ఎక్కించారు. దీంతో సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ప్యాసింజర్ రైలులో తనికీలు చేపట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ బియ్యం విలువ దాదాపు రూ.18వేల విలువ ఉంటుందని రైల్వే ఎస్ఐ లింగయ్య తెలిపారు.

నియామకం

లక్షెట్టిపేట, ఆగస్టు,16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి యువజన సామాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన పాలె నిషాలెనిన్‌కు అవకాశం దక్కింది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈనెల 14న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో వివిధ విభాగాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో లక్షెట్టిపేట వడ్లవాడకు చెందిన నిషాలెనిన్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ప్రకటించి నియామపత్రంను అందజేసింది. ఈసందర్భంగా నిషా మాట్లాడుతూ తనకు అప్పగించిన బాద్యతను తగిన న్యాయం చేస్తానని సంస్థ బలోపేతానికి, ఆశయాల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

జనక్‌ప్రసాద్‌పై ఆరోపణలు చేయడం తగదు

జైపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జనక్ ప్రసాద్‌పై ఆరోపణలు చేయడం హెచ్ఎంఎస్ నాయకులకు తగదని ఎస్టీపీపీ ఐఎన్‌టీయూసీ నాయకులు సోగరి కృష్ణ, రామగిరి మల్లేష్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడు లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు రూ. 5 వేల బోనస్ ఇప్పించిన ఘనత జనక్ ప్రసాద్ కృషియేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశలు నెరవేరక ఆవేదనతోనే రియాజ్ అహ్మద్ వంటి నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్మికులను యాజమాన్యానికి తాకట్టు పెట్టిన చరిత్ర రియాజ్ అహ్మద్‌కే దక్కుతుందన్నారు. జనక్ ప్రసాద్ ప్లాంటు స్థాపనకు ముందే రసూల్‌పల్లిలో నివాసం ఉంటూ కార్మికులతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షురాలు కవిత గతంలో అన్‌ఫిట్ పేరుతో కార్మికులను మోసం చేయడం మేమెప్పుడు వెలికి తీయలేదన్నారు. అయినా హెచ్ఎంఎస్ నాయకులు జనక్‌ప్రసాద్‌పై చేసే నిరాధారణ ఆరోపణలు మానుకోవాలన్నారు. చీకటి ఒప్పందాలు విరమించుకుని కార్మికుల ప్రయోజనాల కోసం హెచ్ఎంఎస్ నాయకులు కృషి చేయాలన్నారు.

దహన సంస్కారాలను అడ్డుకున్న కాలనీ వాసులు

కన్నెపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీగాం గ్రామంలో శనివారం సాయంత్రం సూర పోచక్క అనే వృద్ధురాలు మృతి చెందగా ఆమె అంత్యక్రియలను గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు అడ్డుకున్నారు. కుటుంబీకులు దహన సంస్కారాలు నిర్వహించడానికి ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికకు వెళ్లగా శ్మశాన వాటిక దగ్గరగా ఉందని ఇక్కడ చేయవద్దని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో స్థానికులు కన్నెపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు చేరుకుని కాలనీ వాసులకు నచ్చజెప్పారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరికి ఒకరు సహాయం చేసుకోవాల్సి అవసరం ఉందని చెప్పడంతో వారు ఒప్పుకున్నారు. అనంతరం అంత్యక్రియలను పూర్తి చేశారు.




మంచిర్యాలలో నీట మునిగిన సూర్యనగర్ హమాలివాడ

భైరవస్వామికి అదనపు కలెక్టర్ పూజలు


పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ దంపతులు

కోటపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పారుపెల్లి గ్రామంలోని కాల భైరవ స్వామికి శనివారం అదనపు కలెక్టర్ చంద్రయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవ స్వామిని దర్శించుకుని అదనపు కలెక్టర్ స్వామి వారికి మొక్కులు తీర్చుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనేక సందర్భాల్లో అధికారుల సమక్షంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిలుగా పాల్గొని చెక్కులు పంపిణీ చేయడం సరికాదని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎటువంటి ప్రోటోకాల్ లేకున్నా వారి చేతుల మీదుగా పంపిణీ చేసి పేపర్లలో వేయించుకుంటూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ఈ విధానం తప్పని భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

నస్పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ గేట్ వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలతో చిత్తడి మారుతోంది. వర్షం కురిసిన సమయంలో చుట్టూ ప్రక్కల నీరు డివైడర్ వద్ద నిలిచి ఉంటుంది. వందలాది వాహనాల ఆ నీటిలో నుంచి ప్రయాణించడం మూలంగా నీరంతా బురదగా మారుతుంది. పెద్ద వాహనం వెళ్ళిన సమయంలో దాని పక్కన ఆటో, ద్విచక్ర వాహనాలు వెళ్ళితే ఆ నీరు వాహనం వేగానికి ఇతర వాహనాలపై చీల్లుతుంది. దీంత బురద నీరు ప్రయాణికుల బట్టల పడడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అక్కడ నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అతలాకుతలం

జిల్లాలో భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు, నిలిచిన రవాణా సౌకర్యం
- గరిష్టంగా కోటపల్లిలో 15.8 సెం.మీ నమోదు
- జిల్లాలో సగటు వర్షపాతం 6.2 సెం.మీ.
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం


నస్పూర్‌లోని వెంకటేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వరద నీరు


జిల్లా కేంద్రంలో ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు


నెన్నెల శివారులో నీట మునిగిన పొలాలు

మంచిర్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచే ప్రారంభమైన వర్షం తెల్లవారి ఉగ్రరూపం దాల్చింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా జనజీవనం అతలాకుతలం అయింది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, వాగుల్లో భారీగా వరద నీరు చేరుతోంది. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రవాణా సౌకర్యం నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని రాళ్ల వాగు ప్రమాదకర స్థితిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. అమర వీరుల స్థూపం వద్దగల కాజువే వంతెనపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రంగంపేట- లక్ష్మీనగర్ మధ్య రవాణా పూర్తిగా నిలిచిపోయింది.

జిల్లాలో వర్షపాతం నమోదు...

జిల్లాలో శనివారం 6.2 సెం.మీ సగటు వర్షపాతం నమోదుకాగా, కోటపల్లి మండలంలో గరిష్టంగా 15.8 సెం.మీ వర్షం కురిసింది. వేమనపల్లి మండలంలో 11 సెం.మీ, చెన్నూరు మండలంలో 8.8, లక్షెట్టిపేట మండలంలో 7.8, కాసిపేట మం డలంలో 7.7, జైపూర్ మండలంలో 6.9, నెన్నెల మండలంలో 6.8. మందమర్రి మండలంలో 5.8, జన్నారం మండలంలో 5.7, భీమారం మండలంలో 5.6 సెం.మీ, బెల్లంపల్లిలో 4.7, నస్పూర్‌లో 4.6. చొప్పున వర్షపాతం నమోదైంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీ వరద...

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరద నీరు చేరుతోంది. రాత్రి 8గంటల సమయానికి ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 148.00 మీటర్లకు గాను ప్రస్తుతం 147.24 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 18.063 టీఎంసీల నీరు నిలువ ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 2,11,817 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 2,11,817 క్యూసెక్కులు ఉండగా, హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ స్కీం కోసం 286 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121 క్యూసెక్కులు, పెద్దపల్లి జిల్లా నంది మేడారంలోని నంది పంప్ హౌజ్‌కు 9,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కడెం ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత....

గోదావరి బేసిన్‌లోని నిర్మల్ జిల్లా కడెం రిజర్వాయర్‌కు ఉన్న 18 గేట్లలో 14 గేట్లు తెరిచి 1,07,161 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో నీరు చేరడంతో రాత్రి వరకు 20 గేట్లను ఎత్తి 2,01,960 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు

ఓపెన్ కాస్టుల్లో నిలిచిన ఉత్పత్తి...

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోయాయి. ఓబీ మట్టి తొలగింపు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. క్వారీల్లో పెద్ద మొత్తంలో నీరు చేరడంతో పనులు జరగడం లేదు. దీంతో యంత్రాల సహాయంతో నీటిని తోడుతున్నారు. ముఖ్యంగా మొదటి, రెండవ షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నస్పూర్‌లో పొంగిపొర్లిన డ్రైనేజీలు, ఒర్రెలు.. కాలనీల్లో వర్షపు నీరు..

నస్పూర్ : వాతావరణ ప్రభావం కారణంగా శనివారం ఉదయం నస్పూర్ పట్టణంలో భారీ వర్షం కురిసింది. రెండు గంటలకు పైగా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లోకి ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. డ్రైనేజీలు, ఒర్రెలు వరద నీటితో నిండిపోయి ఉధృతంగా ప్రవహించాయి. సంఘమల్లయ్య పల్లె ప్రాంతం నుంచి ఊరు శ్రీరాంపూర్ మీదుగా నస్పూర్ చెరువులోకి వచ్చే ఒర్రె వరద నీటి ప్రవాహంతో ఉధృతంగా ప్రవహించింది. కాలనీల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చింది. వరద నీరు చేరడంతో సీతారాంపల్లి రోడ్డులోని వెంకటే శ్వర కాలనీలోని పలువురు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సీ సీసీ కార్నర్ నుంచి సీతారాంపల్లికి వెళ్లే మార్గంలో ఒర్రె కాజ్‌వే పై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నస్పూర్ చెరువు పూర్తి స్థాయిలో నిండిపోయి ఎక్కువైనా నీరు మత్తడి ద్వారా దిగువకు వెళ్లతుంది. దిగువన గోదావరి రోడ్డులో వరద నీరు పొలాల నుంచి ప్రవహిస్తూ రోడ్డుపై నుంచి వెళుతుంది. వినూత్న కాలనీ, శ్రీశ్రీ నగర్‌ల మధ్య గల తోళ్లవాగు కాజ్ వే పై నుంచి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాళ్లపల్లి పునరావాస కాలనీలో ఒర్రె వరద నీటితో ఉధృతంగా ప్రవహించడంతో నీరు ముందుకు వె ళ్ల చుట్టు పక్కల ఉన్న ఇళ్లలోకి చేరింది. రోడ్డు మార్గంలోని కాజ్‌వే వంతెన పై నుంచి ప్రవహించడంతో చాలా సేపు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి జనాలు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.


నెన్నెల మండలం లంబాడితండాలో దెబ్బతిన్న పత్తి చేను

నీట మునిగిన పొలాలు, పంట చేన్లు


కోటపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగాయి. సిర్సా, పుల్లగామ, ఏదులబంధం, రొయ్యలపల్లి గ్రామాలకు సరిహద్దుగా ప్రవహిస్తున్న పెద్దలుగు వాగు ఉప్పొంగడంతో సు మారు 450 ఎకరాల్లోని పత్తి చేన్లు నీట మునిగాయి. ఉధృత ప్రవాహంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మరో వైపు ఈ మార్గంలో ఏదుబంధం వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో 8గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడి పరిస్థితిని ఎస్ఐ రాజేందర్, తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. మరో వైపు మల్లంపేట, నక్కలపల్లి దారిలోని చిన్నవాగు ప్రవాహంతో కల్వర్టు కోతకు గురి కాగా లోతొర్రె ఉధృతంగా ప్రవహించింది. దీంతో నక్కల పల్లి వైపు గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. మండలంలోని జనగామ గ్రామంలో చెన్నూరి కవిత అనే మహిళకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఏదులబంధం వద్ద తుంతుంగ వాగు ఉధృతంగా ప్రవహించడంతో తుంతుంగ ప్రాజెక్టులోని నీ రు బయటకు ప్రవహించి సమీపంలోని ఏదుల బంధం, అన్నారం గ్రామాల్లోని పంట చేన్లను నీట ముంచింది. మండల కేంద్రంలోను ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. ప్రాణహిత పరివాహక ప్రాం తంలోని పత్తి చేన్లు నీట మునగడంతో

మిగతా 7లో


అంకగ్‌పల్లి వాగు బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు


కోటపల్లి మండలంలో చెరువులను తలపిస్తున్న పొలాలు


నస్పూర్ చెరువు మత్తడి ప్రవాహంతో దిగువన పొలాల్లో నీరు


వేమనపల్లి శివారులో ప్రాణహిత నదిని పరిశీలిస్తున్న అధికారులు

మోదీ అవినీతి లేని 11ఏళ్ల సుపరిపాలన

బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


సంఘమల్లయ్య పల్లెలో జెండా ఆవిష్కరణ చేస్తున్న వెరబెల్లి రఘునాథ్

నస్పూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో అవినీతి లేని సుపరిపాలనను అందిస్తుందని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. నస్పూర్ పట్టణం సంఘ మల్లయ్య పల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను శనివారం ఆయన ఆవిష్కరించారు. మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్ పేయ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జెండా ఆవిష్కరణ అనంతరం రఘునాథ్ మాట్లాడుతూ మోదీ హయాంలో రూపాయి అవినీతి జరుగ కుండా పారదర్శక పాలన సాగుతోందన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణకు దాదాపు రూ. 30 కోట్ల నిధులు కేటాయించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకట కృష్ణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు కమాలాకర్ రావు, సతీష్ రావు, మిట్టపల్లి మొగిలి, సదయ్య, రమేష్, చక్రవర్తి పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : దేశ దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి, చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీ దీక్షితులు, చప్పిడి నరేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం దివంగత మాజీ దేశ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మ శ్రీపాల్, బత్తుల సమ్మయ్య, కొండపాక చారి, శివ కృష్ణ, వెంకటనర్సయ్య, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద బందోబస్తు

హాజీపూర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేటలో గల శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగం గా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. శనివారం సాయంత్రం ఎల్లం పల్లి ప్రాజెక్టు 20గేట్లు ఎత్తి 70వేల క్యుసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. గుడిపేట ఫిష్‌మార్కెట్ వద్ద ఎల్లంపల్లి ప్రాజెక్టుపైకి వెళ్ల కుండా పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో ప్రాజెక్టు అవతలివైపు వెళ్లే గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్


ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): వాతావరణ సూచన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణ కోసం అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుమార్ దీపక్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు వివరాలను నీటి మట్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 24 నుంచి 36 గంటల వరకు భారీ నుంచి అతిభారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లాలో రెడ్ అలర్ట్ ఆదివారం ఆరేంజ్ అలర్ట్ ఉంటుందని ప్రజా రక్షణ దిశగా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతుందన్నారు. పజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లోతట్టు వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసించేవారిని వెంటనే తరలించాలని వాగులు, నదులు, ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా సిబ్బందితో కలిసి తగు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజల తక్షణ సాయం కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సాయం కోసం08736-250501 నంబర్‌కు ఫోన్ చేస్తే 24గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన ఎండీఆర్ఎఫ్ బృందాలు రక్షణ పరికరాలతో తక్షణ సాయం కోసం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి

కలెక్టర్ కుమార్ దీపక్


ఏదులబంధం వద్ద కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్

కోటపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్‌అన్నారు. వరద ఉధృతి వల్ల మండలంలోని ఏదులబంధం వద్దకోతకు గురైన రహదారిని శనివారం ఆయన పరిశీలించారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే ఈ ప్రాంతంలో ప్రజలు, వాహనదారులు వెళ్లవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి

కోటపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలని దసలి రైతులను అటవీ అధికారుల దాడుల నుంచి రక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మండలంలోని సూపాక గ్రామంలో సంఘం అధ్యక్షుడు ఎర్మ పున్నం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దసలి పై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ కుటుంబాలు 700లకు పైగా ఉన్నాయని 90 సంవత్సరాల కాలంగా దీనిపై ఆధారపడి ఉన్నారని , ఇలాంటి ఆదివాసీలను అటవీ అధికారులు అడవి నుంచి వెళ్లగొట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. మద్ది చెట్లపై పట్టు పురుగుల పెంపకం వద్దంటున్నారన్నారు. పట్టు పురుగులను చంపడం, రైతులను బంధించడం లాంటి చర్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బోడెంకి చందు, అశోక్, తలండి ముత్తయ్య, వెంకటస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి ఉన్నారు.

అలరించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు


దండేపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో వివిధ వేషధారణలతో చిన్నారులు

దండేపల్లి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకోని దండేపల్లి మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దండేపల్లిలో రామాలయం వద్ద నిర్వహించిన శ్రీకృషాజన్మష్టమి వేడుకల చిన్నారులను కృష్ణుడు, రాధ, గోపికల వివిధ వేషదారణలతో సందడి చేశారు. అనంతరం ఊట్టి కొట్టారు.

హాజీపూర్: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడిపేట, నంనూర్, ఆర్అండ్ఆర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో, 13వ బెటాలియన్ గోవింద క్షేత్రంతో పాటు దొనబండ, హాజీపూర్‌లలో వేడుకలు నిర్వహించారు.చిన్నారులు వివిధ వేషదారణలతో అలరించారు.